


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
19-03-2026
పేజీలు: 02




# ఉస్తాద్ భగత్‌సింగ్ రివ్యూ




పవన్‌కల్యాణ్ సినిమా అంటే అంచనాలు సర్వసాధారణం. అందునా 'ఓజీ' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న సినిమా.. పైగా 'గబ్బర్‌సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత హరీశ్‌శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటించిన సినిమా కావడంతో అనౌన్స్‌మెంట్ నుంచి ఆడియన్స్‌లో సినిమాపై క్యూరియాసిటీ హెచ్చుగానే ఉంది. మైత్రీ మూవీమేకర్స్ నిర్మాణ విలువలు, ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన ప్రచారచిత్రాలు అన్నీ సినిమాపై అంచనాలు మరింత పెంచాయి. ఇన్ని ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఈ గురువారం ఎట్టకేలకు 'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదలైంది. మరి అందరి అంచనాలనూ ఉస్తాద్ అందుకున్నాడా? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి. చదలమర్రి నల్లనాగప్ప(పార్థీబన్) పరమ దుర్మార్గుడు. ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలనేది అతని లక్ష్యం. దానికోసం ఎంతకైనా తెగిస్తాడు. ఇందులో భాగంగా తనకు అడ్డున్న రాష్ట్ర ముఖ్యమంత్రిపై హత్యాప్రయత్నం చేస్తాడు. తీవ్రగాయాల పాలై, కొన ఊపిరితో ఉన్న ముఖ్యమంత్రి, హాస్పిటల్ ఇంటెన్సీవ్ కేర్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉంటాడు. దాంతో అదే పార్టీలోని మరో సీనియర్ నేతని అపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారు. అతన్ని కూడా నల్లనాగప్ప హత్య చేయిస్తాడు. దాంతో పార్టీలో మూడో స్థానంలో ఉన్న నల్లనాగప్ప ముఖ్యమంత్రి అవుతాడు. అతని కొడుకు (కిల్లి క్రాంతి) తండ్రిలాగే రాక్షసుడు. ఎంజాయ్‌మెంట్ కోసం తలకోన ఫారెస్ట్‌కి వెళ్తాడు. అక్కడి పోలీసులు వందల టన్నుల గంజాయిని సీజ్ చేశారని తెలిసి, గంజాయి కావాలంటూ.. అక్కడి పోలీస్ స్టేషన్‌పై దాడి చేస్తాడు. పోలీసుల్ని, వాళ్ల కుటుంబీకుల్నీ చిత్రహింసలు పెడుతుంటాడు. అప్పుడొస్తాడు ఉస్తాద్ భగత్‌సింగ్ (పవన్‌కల్యాణ్). ముఖ్యమంత్రి కొడుకుని, అతని మనుషుల్ని ఓ రేంజ్‌లో ఆడుకుంటాడు. కొంతమందినైతే నిర్దాక్షిణ్యంగా చంపేస్తాడు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కొడుకుని కిడ్నాప్ చేస్తాడు. తన కొడుకు ఆచూకీ తెలియకపోవడంతో.. పాతబస్తీలో ఉండే ఉగ్రవాదుల్ని ఆశ్రయిస్తాడు ముఖ్యమంత్రి. ఉగ్రవాదులు.. ముఖ్యమంత్రి కొడుకుని వెతుక్కుంటూ అడవిలోకి వస్తారు. వచ్చినవాళ్లను వచ్చినట్టే అందర్నీ చంపేస్తాడు ఉస్తాద్ భగత్‌సింగ్. ఇంతకీ ఎవరీ ఉస్తాద్ భగత్‌సింగ్? ముఖ్యమంత్రి కొడుకుని ఎందుకు కిడ్నాప్ చేశాడు? ముఖ్యమంత్రికీ ఉగ్రవాదులకూ సంబంధం ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. నిజానికి పరమ రొటీన్ కథ ఇది. అయితే.. ఇలాంటి మాస్ సబ్జెక్ట్‌ని సదరు హీరో అభిమానులకు నచ్చేలా, ఎక్కడా విసుగులేకుండా తీయగలిగితే సినిమా హిట్టే. దర్శకుడు హరీశ్‌శంకర్ ఆ విషయంలో విజయం సాధించాడనే చెప్పాలి. పవన్‌కల్యాణ్ అభిమానులు పండుగ చేసుకునేలా సినిమాను తీర్చిదిద్దాడు హరీశ్ శంకర్. ముఖ్యంగా పవన్ కోసం రాసుకున్న కొన్ని డైలాగులు అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా గూజ్‌బంప్స్ తెప్పిస్తాయి. పవన్‌కల్యాణ్ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్స్ కానీ, ఆ పాత్ర ప్రవర్తన కానీ, ఆ పాత్ర వాడే భాష.. ఇవన్నీ జనాలకు నచ్చేస్తాయి. ప్రథమార్థం అంతా ప్రశ్నలతోనే ముగించాడు హరీశ్‌శంకర్. ద్వితీయార్థం మొదలైనప్పట్నుంచీ ఒక్కో చిక్కుముడిని విప్పుకుంటూ, సమాధానాలిచ్చుకుంటూ ఆసక్తికరంగా కథను నడిపాడు. అందుకే.. ప్రథమార్థం కాస్త సోసోగా అనిపించినా.. ద్వితాయార్థం మాత్రం స్పీడ్‌గా జనరంజకంగా అనిపిస్తుంది. ముఖ్యంగా ద్వితీయార్థంలో శ్రీలీల ఎపిసోడ్‌ని ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. ఈ ఎపిసోడ్‌లో అంతా వింటేజ్ పవన్‌ని చూస్తారు. పవన్ పాత సినిమాను గుర్తు చేస్తూ అభిమానులకు నచ్చేలా సినిమాను తీశాడు హరీశ్ శంకర్. 'తొలిప్రేమ'లోని 'నీ మనసే..' పాటను ఈ సినిమాకోసం మళ్లీ వాడేశాడు. ఈ పాట పిక్చరైజేషన్ కూడా బావుంది. అయితే.. అక్కడక్కడ కామెడీ కోసం పెట్టిన కొన్ని సన్నివేశాలు పంటికింద రాళలాగా ఇబ్బంది పెడతాయి. మొత్తంగా 'ఉస్తాద్ భగత్‌సింగ్' పైసా వసూల్ సినిమా అని చెప్పొచ్చు. పవన్‌కల్యాణ్ గురించి చెప్పేదేముంది? ఇలాంటి పాత్రలు చేయడంలో అతను మాస్టర్ అని 'గబ్బర్‌సింగ్'తోనే రుజువు అయింది. ఈ సినిమాలోనూ అదే జోష్‌తో అలరించారు పవన్‌కల్యాణ్. ఓ విధంగా సినిమా వన్‌మ్యాన్ షో. ఒంటిచేత్తో సినిమాను మోశారు పవన్‌కల్యాణ్. హీరోయిన్లలో శ్రీలీల పాత్ర కథలో చాలా కీలకం.

## ఈ 4 రకాల చీమలు ప్రపంచంలోనే చాలా డేంజర్!




ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైనదిగా బుల్‌డాగ్ చీమ (Bulldog Ant) పేరుగాంచింది. ఇది ఆస్ట్రేలియాలో కనిపిస్తుంది. ఈ చీమ కుట్టడం వల్ల మనిషి నిమిషాల్లో మరణించే అవకాశముంది. అలాగే, ఫైర్ ఆంట్స్ (Fire Ants) తమ గ్రూపుతో దాడి చేస్తాయని అంటారు. ఇవి కుట్టినప్పుడు కలిగే నొప్పి కాల్చినట్లుగా ఉంటుంది. ఫ్లోరిడా హార్వెస్టర్ చీమ తన విషపూరితమైన కాటుతో తీవ్రమైన వాపును కలిగిస్తుంది. గ్రీన్ ట్రీ ఆంట్స్ (Green Tree Ants) చెట్లపై నివసిస్తూ, తమ గూడును రక్షించుకోవడానికి అత్యంత దూకుడుగా దాడి చేస్తాయి.ఆస్ట్రేలియా, ఆగ్నేయ ఆసియా అడవులలో నివసిస్తాయి. ఇవి చెట్ల ఆకులపై పెద్ద గూళ్లు కట్టుకుని నివసిస్తాయి. వీటికి ప్రాదేశిక స్పృహ ఎక్కువ. ఎవరైనా తమ గూడును తాకితే వేల సంఖ్యలో చీమలు ఒకేసారి మనిషిపైకి దూకి దాడి చేస్తాయి. వీటి కుట్టు వల్ల కలిగే రసాయన ప్రభావం వల్ల తీవ్రమైన నీరసం, స్పృహ కోల్పోవడం వంటివి జరగవచ్చు.పరిమాణంలో చిన్నవైనా ఈ చీమలు తమ ఆత్మరక్షణ కోసం ప్రకృతి ఇచ్చిన కెమికల్ వెపన్స్‌ను వాడుకుంటాయి. అడవులకు లేదా తెలియని ప్రాంతాలకు వెళ్ళినప్పుడు ఇలాంటి కీటకాల పట్ల అప్రమత్తంగా ఉండటం మంచిది. అయితే, ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. వీటితో పాటు బుల్లెట్ ఆంట్ (Bullet Ant) కూడా చాలా ప్రమాదకరమైనది. దీని కుట్టు వల్ల కలిగే నొప్పి తుపాకీ గుండు తగిలినంత తీవ్రంగా ఉంటుందని చెబుతారు.

## ఆల్కహాల్ తీసుకోవడం పూర్తిగా మానేశా




తాను ఆల్కహాల్ తీసుకోవడం పూర్తిగా మానేశానని టీమిండియా స్టార్ యుజ్వేంద్ర చాహల్ అన్నాడు. ఐపీఎల్ 2026లో అద్భుతంగా రాణించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ యూట్యూబ్ ఛానెల్‌లో చాహల్ ఈ విషయం గురించి మాట్లాడాడు. కాగా చాహల్.. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న విషయం తెలిసిందే. 'నేను ఆల్కహాల్ తీసుకోవడం పూర్తిగా మానేశా. ఆరు నెలలుగా నేను మందు ముట్టడం లేదు. నా వయసు ఇప్పుడు 35. నేను మరింత యాక్టివ్‌గా ఉండి టీమ్ కోసం 150 శాతం ఎఫర్ట్స్ పెట్టాలని అనుకుంటున్నా. గత సీజన్‌లో కేకేఆర్‌తో ఓ మ్యాచ్ తర్వాత నా పక్కటెముక, కాలి వేలు విరిగింది. అందుకే సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచుల్లో సరైన ప్రదర్శన చేయలేకపోయా. కానీ ఈసారి అలా కాదు. ఓ సీనియర్ ఆటగాడిగా ఈ ఐపీఎల్‌లో ప్రజలు నా నుంచి ఏదైనా నేర్చుకోవాలని కోరుకుంటున్నాను' అని చాహల్ అన్నాడు. 'గత సీజన్‌లో మేం ఫైనల్‌లో ఆర్సీబీతో తలపడ్డాం. ఆ మ్యాచ్‌లో మా స్టార్ ప్లేయర్ మార్కో యాన్సెన్ జట్టుకు దూరమయ్యాడు. ఒకవేళ అతడు ఆడి ఉంటే.. మేం కచ్చితంగా ఐపీఎల్ టైటిల్ గెలిచి ఉండేవాళ్లం. అతడు గత సీజన్‌లో ఆడిన అన్ని మ్యాచుల్లోనూ అద్భుతంగా బౌలింగ్ వేశాడు. బ్యాటింగ్‌లోనూ రాణించాడు. చివర్లో రెండు నుంచి మూడు సిక్సర్లు కొట్టగల సామర్థ్యం అతడికి ఉంది. ప్రస్తుతం యాన్సెన్ బౌలింగ్ చేస్తున్న విధానం చూసి మేం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం' అని చాహల్ వెల్లడించాడు.

## నేటి నుంచి భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు



ఉగాది పర్వదినం సందర్భంగా నేటి నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఉగాది రోజున ఉత్సవాలకు అంకురార్పణ జరపడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. పరాభవ నామ సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలతో ఆలయ అర్చకులు, వేద పండితులు వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 27న మిథిలా మండపంలో సీతారామ కళ్యాణోత్సవం జరపనున్నారు. ఏప్రిల్ 2 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నవమి రోజున రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లు, లక్ష లడ్డూలు సిద్ధం చేసినట్లు వివరించారు.


## విజయవాడలో ఘనంగా ఉగాది వేడుకలు.. పాల్గొన్న సీఎం చంద్రబాబు



ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేదికపై జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఉగాది పచ్చడిని ముఖ్యమంత్రి, మంత్రులు, నేతలు స్వీకరించారు. అనంతరం మాడుగుల నాగఫణి శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

## విదేశీ వైద్యులకు హెచ్-1బీ ఫీజు మినహాయింపు కోరుతూ అమెరికాలో కీలక బిల్లు

అమెరికాలో వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి ఊరట కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసాల కోసం ప్రతిపాదించిన లక్ష డాలర్ల భారీ ఫీజు నుంచి వైద్య రంగానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కొందరు చట్టసభ సభ్యులు అమెరికా కాంగ్రెస్‌లో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలకు చెందిన సభ్యులు కలిసికట్టుగా ఈ బిల్లును తీసుకురావడం గమనార్హం. ఈ భారీ ఫీజు వల్ల దేశంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న వైద్యుల కొరత మరింత పెరిగిపోతుందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "హెచ్-1బీస్ ఫర్ ఫిజీషియన్స్ అండ్ ది హెల్త్‌కేర్ వర్క్‌ఫోర్స్ యాక్ట్" పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులు విదేశీ వైద్యులపైనే ఎక్కువగా ఆధారపడతాయని, లక్ష డాలర్ల ఫీజు వారికి పెను భారంగా మారుతుందని కాంగ్రెస్ సభ్యురాలు మరియా ఎల్విరా సలాజర్ అన్నారు. "వైద్యుల కొరత పెరుగుతున్న తరుణంలో ఇలాంటి ఫీజులు ప్రతిభావంతులైన వైద్యులను నియమించుకోవడానికి ఆసుపత్రులకు అడ్డంకిగా మారకూడదు" అని ఆమె స్పష్టం చేశారు.




## మైసా.. షూటింగ్ స్టార్ట్



అగ్ర తారలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. దాదాపు రెండు వారాల పాటు వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో బిజీగా ఉన్న రష్మిక మందన్న తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టింది. తాజాగా ఆమె పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. ఈ సినిమాలో రష్మిక మందన్న గోండు తెగకు చెందిన యోధురాలి పాత్రలో కనిపించనుంది. కెరీర్‌లో తొలిసారి రష్మిక మందన్న ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌ని చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం షూట్‌లో భాగంగా ఆమెపై యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ ఆండీలాంగ్ నేతృత్వంలో ఈ ఎపిసోడ్‌ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. 'మైసా' చిత్రీకరణ తాలూకు ఫొటోను అభిమానులతో పంచుకుంది రష్మిక మందన్న. దీనికి 'వేట మొదలైంది' అనే క్యాప్షన్‌ను జత చేసింది. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది.

## ఈవీ కారు ఛార్జింగ్ కారణంగా అగ్ని ప్రమాదం.. 8 మంది సజీవదహనం



ఓ ఇంటి బయట ఉన్న ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పాయింట్ పేలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి చెందారు. అత్యంత దారుణమైన ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నారు. మరో ముగ్గుర్ని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. కారు ఛార్జింగ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు జరిగినట్టు స్థానికులు పేర్కొన్నారు. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోవడం వల్ల తీవ్రత ఎక్కువైంది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ధురంధర్ 2 రివ్యూ




రణ్ వీర్ సింగ్ మరియు ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ధురంధర్' తక్కువ అంచనాలతో మొదలై, భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక చరిత్రను సృష్టించింది. మొదటి భాగం భారీ విజయం సాధించాక, ఈ ఫ్రాంచైజీ ఒక ఉద్యమంలా మారింది. ఇప్పుడు 'ధురంధర్: ది రివెంజ్' భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చింది. ఈ సీక్వెల్ ఎలా ఉందో రివ్యూలో చూద్దాం. రెహమాన్ డకైత్ (అక్షయ్ ఖన్నా) మరణం తర్వాత ల్యారీలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతాయి. హంజా అలీ మజారీ అలియాస్ జస్కీరత్ సింగ్ రంగీ (రణ్వీర్ సింగ్), ఎస్పీ చౌదరి అస్లాం (సంజయ్ దత్) మరియు అర్షద్ పప్పు (అశ్విన్ దార్) కలిసి రెహమాన్‌ను చంపారని ఉజైర్ బలోచ్ (డానిష్ పాండోర్) నమ్మేలా చేస్తాడు. దీనితో ఉజైర్ అర్షద్ పప్పును చంపేస్తాడు, కానీ అనూహ్య పరిణామాల వల్ల హంజా లియారీని తన ఆధీనంలోకి తీసుకుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? హంజా గతం ఏమిటి? అనేదే ఈ చిత్ర కథాంశం. 4 గంటల నిడివి ఉన్నప్పటికీ, ఆదిత్య ధర్ తన అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకులను కట్టిపడేశాడు. ఇంత లెంగ్త్ లోను ఎక్కడా బోర్ కొట్టకుండా కథను నడిపించడంలో ఆయన విజయం సాధించారు. రణవీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషన్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్ అద్భుతం. ముఖ్యంగా క్లైమాక్స్‌లో ఆయన నటన చిరస్థాయిగా నిలిచిపోతుంది. సినిమాలో వచ్చే ట్విస్టులు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయి. దేశభక్తిని చాలా శక్తివంతంగా చూపించారు. ప్రీ-క్లైమాక్స్ నుండి క్లైమాక్స్ వరకు వచ్చే సీన్లు సినిమాకే హైలైట్ విలన్‌గా అర్జున్ రాంపాల్ నటన అద్భుతం. సంజయ్ దత్, ఆర్. మాధవన్, సారా అర్జున్ మరియు డానిష్ పాండోర్ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. సినిమాలో కొన్ని రాజకీయ అంశాలు నేరుగా ఉండటం వల్ల కొంతమంది ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. ముఖ్యంగా "ఆపరేషన్ గ్రీన్ లీఫ్" ఎపిసోడ్ చర్చలకు దారితీసే అవకాశం ఉంది. శాశ్వత్ సచిదేవ్ అందించిన నేపథ్య సంగీతం బాగున్నప్పటికీ, పాటలు మొదటి భాగం అంత స్థాయిలో లేవు. రెండో భాగం ప్రారంభంలో కొన్ని సీన్లు కొంచెం సాగదీసినట్లు అనిపిస్తాయి. వికాస్ నౌలాఖా సినిమాటోగ్రఫీ, శివకుమార్ పనిక్కర్ ఎడిటింగ్ వరల్డ్ క్లాస్ రేంజ్‌లో ఉన్నాయి. ఆదిత్య ధర్ మేకింగ్ స్టైల్ ఒక స్పై థ్రిల్లర్‌ను ఎలా తీయాలో నేర్పే పాఠ్యపుస్తకంలా ఉంది. ఓవరాల్ గా చెప్పాలంటే.., 'ధురంధర్: ది రివెంజ్' ప్రేక్షకులను పూర్తిస్థాయిలో సంతృప్తి పరిచే ఒక గొప్ప సీక్వెల్. రణవీర్ సింగ్ విశ్వరూపం, ఆదిత్య ధర్ విజన్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. కొన్ని రాజకీయ వివాదాలు, రొటీన్ పాటలు పక్కన పెడితే, ఇది తప్పక చూడాల్సిన చిత్రం. బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయం.




## ఇషాన్ కిషన్‌కు మరో బంపరాఫర్

నిరుడు దేశవాళీల్లో సత్తాచాటి టీ20 ప్రపంచకప్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చి భారత్‌కు మూడో కప్పును అందించడంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్‌కు మరో బంపరాఫర్ దక్కిం ది. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో అతడు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వెన్నుగాయం కారణం గా ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోని రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్.. కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్న తరుణంలో సన్‌రైజర్స్ తాత్కాలిక సారథిగా ఇషాన్‌ను నియమించింది. అతడికి డిప్యూటీగా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. కమిన్స్ ఎన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ అతడు ఈనెల 23న ఫ్రాంచైజీతో కలుస్తాడని జట్టు వర్గాల సమాచారం. ఇక్కడే అతడి పునరావాసం కొనసాగనున్నట్టు తెలుస్తున్నది. ఎస్‌ఆర్‌హెచ్ ఈనెల 28న బెంగళూరులో డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఐపీఎల్-19 ప్రారంభ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్న విషయం తెలిసిందే.




## 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తెలుగు ట్రైలర్ విడుదల

మార్వెల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' చిత్రానికి సంబంధించిన అధికారిక తెలుగు ట్రైలర్ విడుదలైంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతుంది. టామ్ హోలండ్ హీరోగా నటిస్తున్న ఈ నాలుగవ సోలో చిత్రం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక 'నో వే హోమ్' తర్వాత పీటర్ పార్కర్ తన గుర్తింపును కోల్పోయి ఒంటరిగా మారిన తర్వాతి కథాంశంతో ఈ సినిమా సాగనుంది. న్యూయార్క్ నగరంలో పీటర్ తన కొత్త జీవితాన్ని ఎలా నెట్టుకొచ్చాడు, స్పైడర్-మ్యాన్‌గా అతను ఎదుర్కొన్న నూతన సవాళ్లు ఏమిటి అనే ఉత్కంఠభరిత అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ముఖ్యంగా ఈ చిత్రంలో హల్క్ పాత్రలో మార్క్ రుఫాలో, పనిషర్ పాత్రలో జాన్ బెర్నల్ కనిపించనుండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తన శక్తులలో వస్తున్న జన్యుపరమైన మార్పులను గమనిస్తూ, సొంతంగా తయారు చేసుకున్న రెడ్-అండ్-బ్లూ సూట్‌లో పీటర్ పార్కర్ కనిపిస్తున్న దృశ్యాలు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ చిత్రం జూలై 31, 2026న తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## కవిత కొత్త పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి'గా ఖరారు



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు వేళ కీలక పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే పార్టీ పేరు ఖరారు చేసిన కవిత ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేసారు. అయితే, ఇప్పుడు ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. కాగా, కొత్త పార్టీని భారీ బహిరంగ సభ ద్వారా ప్రకటించేందుకు కవిత ముహూర్తం ఫిక్స్ చేసారు. అదే విధంగా తాను పోటీ చేసే నియోజకవర్గం పైన కవిత ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు వేళ కీలక పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే పార్టీ పేరు ఖరారు చేసిన కవిత ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేసారు. అయితే, ఇప్పుడు ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. కాగా, కొత్త పార్టీని భారీ బహిరంగ సభ ద్వారా ప్రకటించేందుకు కవిత ముహూర్తం ఫిక్స్ చేసారు. అదే విధంగా తాను పోటీ చేసే నియోజకవర్గం పైన కవిత ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటు ఖరారైంది. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం నాడు భారీ బహిరంగ సభ ద్వారా రాజకీయంగా కొత్త లక్ష్యం ప్రకటించేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే 'తెలంగాణ ప్రజా జాగృతి'గా తన పార్టీ పేరు ఖరారు చేసారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న పార్టీ పేరు, జెండా, అజెండాను ఆమె లాంఛనంగా ప్రకటించనున్నారు. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, తాజాగా ఢిల్లీ హైకోర్టులో కవిత పిటీషన్ దాఖలు చేసారు. ఎన్నికల సంఘం వేగంగా తమ దరఖాస్తు పరిశీలించి ఉత్తర్వులు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కేసును న్యాయస్థానం మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కొత్త పార్టీ ద్వారానే పోటీ చేయాలని కవిత నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జాగృతి బృందంతో కలిసి పార్టీ నిర్మాణ కసరత్తును ఆమె ముమ్మరం చేశారు. కవిత తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి' పేరు స్ఫూర్తితో, కొత్త పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' అని పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ. కాగా, కవిత వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తమ పార్టీకి కంచు కోటగా ఉంటూ.. ఎప్పుడు పోటీ చేసినా హరీష్ కు రికార్డు మెజార్టీ కట్టబెడుతున్న సిద్దిపేట నుంచి పోటీ చేయాలని కవిత భావిస్తున్నారు. సిద్దిపేట లేదా కామారెడ్డి నుంచి పోటీకి కవిత ఆలోచనలు చేయగా.. సిద్దిపేట ఖరారు చేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తరువాత పలు సందర్భాల్లో హరీష్ ను టార్గెట్ చేస్తున్న కవిత.. ఇక, నేరుగా ఎన్నికల్లోనూ హరీష్ పైనే పోటీ చేయాలని డిసైడ్ అయినట్లు సమాచారం.



## శర్వానంద్ జోడీగా?

ఒకప్పుడు తెలుగులో ఓ వెలుగువెలిగిన కన్నడ భామ పూజాహెగ్డే గత ఐదేళ్లుగా రేసులో పూర్తిగా వెనకబడింది. టాలీవుడ్‌లో పూర్వ వైభవం కోసం ఎదురుచూస్తున్న ఈ సొగసరికి ప్రస్తుతం పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. తెలుగులో దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఆమె ఓ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా వుండగా ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. శర్వానంద్ కథానాయకుడిగా సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. 'జార్జ్‌క్రిష్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని సమాచారం. కథానుగుణంగా ఇద్దరు నాయికలకు చోటుందని, ఇప్పటికే రుక్మిణి వసంత్ పేరును ఖరారు చేయగా, మరో కథానాయికగా పూజాహెగ్డే వైపు చిత్రబృందం మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## UGADI SPECIAL MOVIE POSTERS













